# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 160 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 09 మే 2026 | పేజీలు : 4


## వడ్ల కొనుగోళ్లు స్పీడప్ చేయాలి

- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

2







## మహేశా.. అది చెత్త బండి కాదట..
# మరి గిదేంది సారూ..!!

ఎఫెక్ట్

జనగామలో జనగణన అవగాహన మ్యారథాన్ వాక్ శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. అయితే ర్యాలీ పూర్తి తరువాత వచ్చిన పిల్లలను అధికారులు చెత్త తరలించే వాహనంలో పంపడంపై 'మన చౌరాస్తా' దినపత్రికలో వచ్చిన కథనానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెంటనే స్పందించారు. సంబంధిత అధికారిని వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి 'అది చెత్త బండి కాదు.. హరితహారం కోసం వాడే వాహనం..' అని పేర్కొంటూ మీడియాకు రిజాయిండర్ సమర్పించారు. అయితే ఆ వాహనంపై 'స్వచ్ఛ తెలంగాణ.. తడి చెత్త.. జనగామ' అని ఉండడం గమనార్హం. చూసిన కళ్లదే తప్పు తప్పు.. తమది కాదు అన్నట్టు ఉంది కదా ఇది.. - మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి



పురపాలక సంఘ కార్యాలయము :: జనగామ
జిల్లా : జనగామ

శ్రీ డి. మహేశ్వర్ రెడ్డి,
కమీషనర్,
పురపాలక సంఘం, జనగామ.

శ్రీయుత జిల్లా కలెక్టర్,
జనగామ గారికి.

లేఖ నెం.ఎం.సి.జె./2026, తేది.08-05-2026

అర్యా !

విషయము :- పురపాలక సంఘం, జనగామ - తేది.08-05-2026 రోజున "చెత్త వాహనంలో పిల్లల తరలింపు" అనే వార్తకు రిజాయిండర్ సమర్పించుట గురించి.

- - - -

జనగామ పట్టణములో తేది.08-05-2026 రోజున జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా సంజయ్‌నగర్ మినీ స్టేడియంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్న విద్యార్థులను మినీ స్టేడియంలో విధులు నిర్వహిస్తున్న పి.ఈ.టీ. గారి అభ్యర్థన మేరకు హరితహారంకు ఉపయోగించే ఆటోను మాత్రమే విద్యార్థులను జనగణన-2027 కార్యక్రమం పై అవగాహన ర్యాలీ కార్యక్రమానికి పాల్గొనేందుకు ఉపయోగించడం జరిగినదని తమరికి తెలియజేయుచున్నాము.

భవదీయుడు,
కమీషనర్,
పురపాలక సంఘం, జనగామ.



# 'మూసీ' తొలిదశకు రూ.7,055 కోట్లు

- తొలిదశలో హిమాయత్ సాగర్ నుంచి
- బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్
- తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశం
- కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో నిర్ణయం

**హైదరాబాద్, మన చౌరాస్తా** : మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టును మొత్తం 55 కిలోమీటర్ల మేర 5 దశల్లో అభివృద్ధి చేపట్టనున్నారు. ఫేజ్-1కు 7,055 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేశారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల కోసం సాంకేతిక, ఆర్థిక చర్చలు పూర్తి అయ్యాయి. ప్రజా భవన్‌లో మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును ప్రజల భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా ప్రాజెక్టును రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అలైన్‌మెంట్ మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. నదిలోని చెత్తను తొలగించి, రివర్ బెడ్ ప్రొఫైలింగ్‌ను ప్రభుత్వం చేపట్టనుంది. వరద నియంత్రణకు రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించనున్నారు. మూసీ రెండు వైపులా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణకు డీపీఆర్‌ను తయారీకి నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు వివరాలను నగరవ్యాప్తంగా ప్రచారం చేయాలని సబ్ కమిటీ ఆదేశించింది. బస్టాండ్లు, ప్రధాన రోడ్లు, థియేటర్లలో ప్రచార వీడియోలు ప్రదర్శించనున్నారు. 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించడం లక్ష్యంగా నిర్ణయించారు. డిసెంబర్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక పర్యవేక్షణకు సహకారం తీసుకోనున్నారు. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మూసీపై రబ్బర్ డ్యామ్ నమూనాలను ఈ సందర్భంగా ఉపసంఘం పరిశీలించింది.




# కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకతకు ప్రాధాన్యం
- కేంద్రాల్లో సౌకర్యాలపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆరా



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ కేంద్ర నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం జిల్లాలోని చిల్పూర్ మండలంలోని చిన్న పెండ్యాల గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వడ్ల నాణ్యత, తేమ శాతం పరీక్షలు, బస్తాల నిల్వలు, హమాలీల సేవలు, రవాణా ఏర్పాట్లు, ట్రక్ షీట్, కాంటాలు, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే రైతులకు కల్పిస్తున్న మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. రైతుల నుంచి ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండల దృష్ట్యా రైతులకు తాగునీరు, నీడ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి, ఎటువంటి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే లారీల ద్వారా ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియ సకాలంలో చేపట్టాలని, లారీలలో ధాన్యం బస్తాలను వేగంగా నింపి, ఓ వ్యక్తి లారీతో పాటు సంబంధిత మిల్లులకు వెళ్లి, అక్కడ అన్ లోడింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## ఓపీఎంఎస్‌లో వివరాలను వెంటనే నమోదు చేయాలి : కలెక్టర్



**జనగామ, మన చౌరాస్తా :** రైతులు పండించే ప్రతి ధాన్యం గింజను సకాలంలో కొనుగోలు చేసి, ట్యాగ్ చేసిన మిల్లులకు ఎలాంటి ఆలస్యం లేకుండా రవాణా చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఐకేపీ, పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు, ఓపీఎంఎస్ లో నమోదు, మొదలగు అంశాలపై ఏపీఎం, సీసీలు, కేంద్ర నిర్వాహకులతో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రాల వారీగా ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలు, గన్ని బ్యాగ్ లు సరిపడా పంపిస్తున్నారా లేదా? కేంద్రాలకు కేటాయించిన లారీలు వస్తున్నాయా? లేదా ? అలాగే నమోదు అయిన ఓపీఎంఎస్ వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకునేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఒక్కో వాహనాన్ని కేటాయించామని, ధాన్యం రవాణాలో ఆలస్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోం, జడ్పీ సీఈఓ, ఇంచార్జ్ డీఆర్డీఓ రంగారావు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, పౌరసరఫరాల డీఎం హతిరామ్, అదనపు డీఆర్డీఓ నూరుద్దీన్, డీటీ సీఎస్ లు, పీఏసిఎస్ సిఈఓలు పాల్గొన్నారు.

# మత్స్యకారులంతా సభ్యత్వం నమోదు చేసుకోవాలి




స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : జనగామ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ స్థాయి మత్స్యకారుల అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన ప్రమోటర్ నీల రాజు ముదిరాజ్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని సొసైటీల సభ్యులు, మహిళా మత్స్యకారులు తప్పనిసరిగా జాతీయ మత్స్యకారుల డిజిటల్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రమాద బీమా లేదా ప్రభుత్వ రాయితీలు పొందాలంటే ఈ నమోదు సంఖ్య తప్పనిసరని స్పష్టం చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి రానప్రతాప్ సింగ్ మాట్లాడుతూ చేపల ఉత్పత్తి పెంచడం, చెరువుల్లో గుర్రపుడెక్క వంటి కలుపు నివారణ, చేపలకు వచ్చే వ్యాధులువాటి నివారణ పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై సవివరంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాగునీటి శాఖ కార్యనిర్వాహక, సహాయక ఇంజనీర్లతో పాటు ఘనపూర్ స్టేషన్ పురపాలక సంఘం వైస్ చైర్మన్ నీల రాజమ్మ గట్టయ్య, మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ భుర్ల శంకర్ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు నీల గట్టయ్య ముదిరాజ్, రాష్ట్ర యువత కార్యదర్శి గోరంట్ల యాదగిరి ముదిరాజ్ పాల్గొన్నారు.



# మత్స్యకారులకు అవగాహన సదస్సు

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశాల మేరకు శుక్రవారం ఘనపూర్ (స్టేషన్), జనగామ, పాలకుర్తి నియోజకవర్గ పరిధిల్లోని రైతు వేదికల వద్ద మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య ఉత్పత్తి పెంపు, చెరువుల సమర్థ నిర్వహణ, చేపల వ్యాధుల నివారణ, కలుపు నియంత్రణ చర్యలు, ఆధునిక చేపల పెంపక విధానాలపై మత్స్యకారులకు అధికారులు వివరించారు. అలాగే ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, చేప పిల్లల వితరణ, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సంఘాల సభ్యులు, మత్స్యకారులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులకు ఎమ్మెల్యే పల్లా ఆశీర్వాదం

**నర్మెట, మన చౌరాస్తా :** నర్మెట కేఎస్ ఆర్ గార్డెన్స్ లో చేర్యాల మండలం పెద్ద రాజుపేట గ్రామ సర్పంచ్ గార్నెపల్లి పద్మ కుమారుడు రాము వివాహం జరిగింది. ఈ వేడకకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



# స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్ ఘనపూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ స్నేహాన్ని చాటుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన తమ స్నేహితుడు అక్కనపల్లి రాజు తండ్రి బ్రహ్మాచారి మృతి చెందిన విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు, వారి కుటుంబాన్ని పరామర్శించారు. రాజు నివాసానికి వెళ్లిన బ్యాచ్ సభ్యులు, ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించి తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తమ వంతు సహాయంగా రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో దశరథ్, రమేష్, లక్ష్మణ్ గౌడ్, శీను గౌడ్, రాజు, యకస్వామి, గూడెల్లి శ్రీనివాస్, శీనుగౌడ్, కుమార్, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.




# రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

■ **వరంగల్ ఎంపీ కడియం కావ్య**



**హనుమకొండ, మన చౌరాస్తా :** తలసీమియా బాధితులకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. హనుమకొండ రెడ్ క్రాస్ భవన్‌లో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, అంతర్జాతీయ తలసీమియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి ముందు ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వృద్ధులతో ముచ్చటిస్తూ, క్యారం బోర్డు ఆడి వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ తలసీమియా వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న చిన్నారులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అంతర్జాతీయ తలసీమియా దినోత్సవం సందర్భంగా తలసీమియా బాధితులకు పండ్లు పంపిణీ చేసి, వారికి రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి డా. కడియం కావ్య, పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 20 మంది కార్మికులకు కిచెన్ సెట్లు, బ్లాంకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ల రమణా రెడ్డి, భూపాలపల్లి రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, డెమో అశోక్ రెడ్డి, మాతా శిశు సంక్షేమ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ రుబీనా అఫ్రోజ్, రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులు పాల్గొన్నారు.



# పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన మే 2026 ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే 2026 ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 13 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి ఏడాది పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకని, రెండో ఏడాది పరీక్షలు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరగనున్నాయన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 12 పరీక్ష కేంద్రాల్లో 2,338 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 1,259 మంది రెండవ సంవత్సరం విద్యార్థులతో కలిపి మొత్తం 3,597 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని వెల్లడించారు. ఈ మేరకు (12) మంది చీఫ్ సూపరింటెండెంట్లు, (12) మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, (02) అదనపు చీఫ్ సూపరింటెండెంటులు, (02) కస్టోడియన్లు, (01) ఫ్లయింగ్ స్క్వాడ్, (01) సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించామన్నారు. నిర్దేశించిన మూడు మార్గాల ద్వారా ప్రశ్నపత్రాలను ఆయా పరీక్ష కేంద్రాలకు పటిష్ట భద్రత నడుమ చేరవేయాలన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో నిఘా నేత్రాలను (సీసీ కెమెరాలు) సరిచూసుకోవాలన్నారు. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా అధిక సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పరీక్షలు రాసే విద్యార్థులు www.tgbie.cgg.gov.in ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అదే విధంగా దివ్యాంగ విద్యార్థులకు స్క్రైబ్ సౌకర్యాన్ని కల్పించాలని, అందుకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని, ప్రతి కేంద్రంలో ర్యాంప్ వసతి, తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్ష కేంద్రాలకు సమీపంలో గల జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, పరీక్షలు రాసే విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్ కు ఎక్కడా కూడా అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు, ఏమైనా సందేహాలు ఉంటే టెలీ మానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించాలని, తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలని కోరారు. సమన్వయ సమావేశంలో డీఐఈఓ జితేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పుస్తె మెట్టెలు అందజేత

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే వాస్విక్ ఫౌండేషన్ మరోసారి తన ఉదారతను చాటుకుంది. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం, బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్వామి, రజిత కుమార్తె స్పందన (కావేరీ) వివాహానికి ఫౌండేషన్ తరపున పుస్తె మెట్టెలు అందజేశారు. శుక్రవారం బసిరెడ్డిపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో వాస్విక్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ నూకల భాస్కర్ రెడ్డి స్వయంగా పాల్గొని చైర్మెన్ నిడిగొండ నరేష్ కుమార్ సూచనలతో వధువు కుటుంబ సభ్యులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో గార్లపాటి మహిపాల్ రెడ్డి, ఆముదాల భూపాల్ రెడ్డి, నూకల నర్సింహారెడ్డి, సర్పంచ్ నల్ల సిద్ధినార్సమ్మ మల్లయ్య, ఉప సర్పంచ్ కరుణాకర్, బుచ్చిరెడ్డి వెంకటయ్య, సీతారాములు, నరసింహ, ఆంజనేయులు, యాదగిరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.





# చిన్నారి తన్మయిని ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

**వరంగల్, మన చౌరాస్తా :** గ్రేటర్ వరంగల్ ఏనుమాముల 14వ డివిజన్ మణికంఠ కాలనీ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కంచ శ్రీను పుత్రిక తన్మయి సారీ ఫంక్షన్ వేడుకలు శుభం గార్డెన్‌లో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.14వ డివిజన్ మాజీ యూత్ అధ్యక్షుడు కుంభం శివ యూత్ నాయకులు పిట్ట సుధీర్ చిన్నారికి నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ అడుప మహేష్ విచ్చేసి చిన్నారిని ఆశీర్వదించి ఆమె భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆదివాసి కాంగ్రెస్ నాయకులు పులిచేరి రాధాకృష్ణ, ఇందిరమ్మ కాలనీ ఫేస్ 1 కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గొలుసుల సంతోష్, నర్సింగోజు నరేంద్ర చారి, బండ్ల సురేందర్, వడ్లకొండ తిరుపతి, గుగులోతు దస్రు, రామగిరి మహేష్ పాల్గొన్నారు.

## దుర్గామాతకు డీసీసీ అధ్యక్షురాలి పూజలు



**నర్మెట, మన చౌరాస్తా :** నర్మెట మండలంలోని వెల్దండ గ్రామంలో శుక్రవారం దుర్గమాత పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో జనగామ డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి కార్యకలాపాలపై ఆప్యాయంగా ముచ్చటించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**స్టేషన్ ఘనపూర్, మన చౌరాస్తా :** స్టేషన్ ఘనపూర్ లో శనివారం పట్టణ కేంద్రంలోని 33/11కేవి ఘనపూర్ టౌన్ విద్యుత్ ఉపకేంద్రంతో పాటు తాటికొండ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘనపూర్ ఆపరేషన్ ఏఈ పగిడిముంతల శంకర్ తెలిపారు. ప్రతినెల రెండో శనివారం సబ్ స్టేషన్లలో నెలవారి (మెంటనెన్స్) మరమ్మతులు చేపడుతున్న కారణంగా 33/11కేవి ఘనపూర్ టౌన్, తాటికొండ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మూడుగంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఏఈ శంకర్ కోరారు.




## ఓటిటిలోకి వచ్చేస్తోన్న
# ధురంధర్-2

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ 2 ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ సినిమా డిజిటల్ విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, తాజాగా ఓటీటీ విడుదల తేదీపై స్పష్టత వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా అద్భుత వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఇప్పుడు మే 15 నుంచి ఈ సినిమా ఓటీటీలో ప్రసారం కానుందని సినీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. 'ధురంధర్ 2' ఒకేసారి రెండు ప్రముఖ ఓటీటీ వేదికల్లో విడుదల కానుంది. భారతదేశంలో ఈ చిత్రం జియో హాట్‌స్టార్‌లో అందుబాటులోకి రానుండగా, విదేశీ ప్రేక్షకుల కోసం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**